

మంత్రిపై అసత్య ఆరోపణలు మానుకో..

■ ఉషశ్రీపై టీడీపీ మద్దతు సర్పంచ్‌ల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపిస్తే.. తమ పార్టీలో చేరేందుకు నియోజకవర్గంలో చాలామంది వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని టీడీపీ మద్దతు సర్పంచ్‌లు పేర్కొన్నారు. టీడీపీ కండువా కప్పుకున్న సర్పంచ్‌లకే నిధులిస్తామని మంత్రి సవిత పేర్కొన్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ విమర్శించడం పట్ల సర్పంచ్‌లు మండిపడ్డారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. ఉనికి కోసం రాజకీయాలు చేసే దుస్థితిలో ఉషశ్రీ ఉన్నారన్నారు. మంత్రి సవితకు ఆ పరిస్థితి లేదన్నారు. ఆమె పిలిస్తే టీడీపీలోకి క్యూ కడతారన్నారు. మంత్రి సవితపై లేనిపోని ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధికి నిధులివ్వకుండా, కేంద్రం ఇచ్చిన వాటిని కూడా దారి మళ్లించి సర్పంచ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన మూడు నెలల్లోనే పంచాయతీలకు నిధులిచ్చి, సర్పంచ్‌లకు గుర్తింపు ఇచ్చిందన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు శ్రీనివాసులు, నాగరాజు, అశ్వత్థరెడ్డి, నరసింహమూర్తి, నరసింహులు, మంజు, జనార్దన్, నాగరాజు పాల్గొన్నారు.

ఇసుక తరలించారో..!

■ ఇసుక అక్రమ రవాణాదారుడి హుకుం



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12: మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అది ఓ నాయకుడు బెదిరించే స్థాయికి చేరింది. ఇతరులెవరూ ఇసుక తరలించకూడదని ఏకంగా హుకుం జారీ చేశాడట. తానొక్కడినే ఇసుక అక్రమంగా తరలించుకుంటానని బెదిరిస్తున్నట్లు చర్చ సాగుతోంది. మండలంలోని రాంపురం, కొండంపల్లి, మరువపల్లి, గోనిపేట, శెట్టిపల్లి పరిసర ప్రాంతాల నుంచి పెనుకొండ పట్టణానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా ఓ నాయకుడు ఇతరులు ఎవరూ ఇసుక తరలించకూడదని ట్రాక్టర్ యజమానులకు హుకుం జారీచేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని జనం కోరుతున్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు



నిబంధనల మేరకే ఇసుక తరలించాలి. అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పోలీసులకు సమాచారం అందించి, కట్టడి చేస్తాం.

-వెంకటశివరామిరెడ్డి, ఇన్‌చార్జి ఆర్డీఓ



కప్పలబండ పారిశ్రామిక పార్కులో వేస్తున్న రోడ్డు

పరిశ్రమలు పెట్టాల్సిందే..!

భూములు తీసుకున్న వారికి ఏపీఐఐసీ నోటీసులు

పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు

త్వరలో కొత్త పారిశ్రామిక విధానం

పుట్టపర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పారిశ్రామిక హబ్‌గా అవతరించింది. ప్రపంచ పారిశ్రామికవేత్తల చూపు జిల్లాపై పడింది. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో ఏపీలోనే ఆటోమొబైల్ హబ్‌గా మారింది. ఈనేపథ్యంలో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి పారిశ్రామిక వాడల్లో భూముల, ప్లాట్లు తీసుకున్న వారిపై దృష్టి సారించింది. పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) ఒత్తిడి తెస్తోంది. ఆ మేరకు నోటీసులు జారీ చేస్తోంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అభివృద్ధి జాడలేకుండా పోయింది. పారిశ్రామిక రంగం కుదేలైంది. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతోంది. జిల్లాలోని పారిశ్రామికపార్కుల్లో ఎన్ని ప్లాట్లు, భూములు ఖాళీగా ఉన్నాయి, ఔత్సాహికులు ఎందుకు ముందుకు రాలేదు, ఏపీఐఐసీ తరఫున ఇంకా ఏవైనా సౌకర్యాలు కల్పించాలా అనే అంశాలపై ఇటీవల పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్షించారు. భూములు, ప్లాట్లు తీసుకున్న వారు పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఆ మేరకు జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం త్వరలో కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకురానుంది. పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం) విధానంలో పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయనుంది.

ప్రోత్సాహకాలు ఇవ్వకనే..

గత వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్ విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుల ఆకర్షణీయ సదస్సులో రూ.13లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు ఇచ్చాయని గొప్పలు చెప్పారు. జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటైంది లేదు. కొత్తగా ఉద్యోగావకాలు కల్పించిందీ లేదు. వచ్చిన పరిశ్రమలు పక్కరాష్ట్రాలకు తరలిపోయేలా చేశారు. ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో ఉన్న పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. పెనుకొండ, కప్పలబండ, గుడిపల్లి, కుటాగుళ్ల, కొటిపి ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్లాట్లు కేటాయించినా పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకురాలేదు. పార్కుల్లో భూముల ధరలు భారీగా పెంచేశారు. లీజుతో ఔత్సాహికులు భూమి కొనుగోలు చేయడంతోపాటు యూనిట్ స్థాపించేందుకు సొంతంగా వనరులు సమకూర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో భూమిని హామీగా చూపి బ్యాంకు నుంచి రుణం తీసుకునే వెసులుబాటు ఉండేది. అందుకు భిన్నమైన విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం అనుసరించింది. గత ఐదేళ్లలో ఏర్పాటైన పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో అనువైన భూములున్నా పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయించేలా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సర్కారే సొంతంగా గానీ, ప్రైవేటు భాగస్వామ్యంతోగానీ సౌకర్యాలు కల్పించాలని భావిస్తోంది.

సంప్రదింపులు

జిల్లాలో పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కుల్లో భూములు, ప్లాట్లు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా చాలామంది పారిశ్రామికవేత్తలు న్యాయస్థానాల మెట్లు ఎక్కారు. జిల్లావ్యాప్తంగా ఏపీఐఐసీకి చెందిన వందలాది ప్లాట్లు, భూములు న్యాయవివాదాల్లో చిక్కుకుని, వృథాగా పడి ఉన్నాయి. అలాంటి భూములను గుర్తించాలని ఏపీఐఐసీ నిర్ణయించింది. వివాదం ఏంటి, ఒప్పందంలో ఏ నిబంధనలపై కోర్టును ఆశ్రయించారు, ఆ భూములను ఎలా స్వాధీనం చేసుకోవచ్చు, ఎలా వినియోగంలోకి తేవచ్చు అన్న అంశాలపై ఏపీఐఐసీ దృష్టి పెట్టింది. ప్రత్యేకంగా న్యాయనిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తద్వారా వివాదాలను పరిష్కరించాలనీ, ఆ భూములను పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. ఏపీఐఐసీ నుంచి భూములు తీసుకున్న కొందరు పారిశ్రామికవేత్తలు నిర్దేశిత గడువులోగా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. భూములను వెనక్కి కూడా ఇవ్వలేదు. ఏపీఐఐసీ నిబంధనల ప్రకారం గడువులోగా పరిశ్రమలు నెలకొల్పని వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ భూములను వెనక్కి తీసుకోవాల్సి ఉంది. కొందరు పారిశ్రామిక వేత్తలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి, స్టే తెచ్చుకోవడంతో స్వాధీనం చేసుకోలేకపోతోంది. భూములు, స్థలాలు వృథాగా పడి ఉండటం కారణంగా వాటి అభివృద్ధికి చేసిన ఖర్చు, పెట్టుబడుల రూపేణా నష్టం వాటిల్లుతోందని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రహదారుల వెంట పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేసి, ప్రోత్సాహకాలు ఇస్తోంది. తాజాగా జిల్లాలో బెంగళూరు-హైదరాబాద్ 44వ జాతీయ రహదారిని 12 వరుసలకు విస్తరించేందుకు ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో జిల్లా ముఖచిత్రం మారింది. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు క్యూకడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సేకరించిన భూములతోపాటు కొత్తగా ఏయే ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయవచ్చోనన్న దానిపై సర్వే చేస్తోంది.

ఏర్పాటు చేయాల్సిందే..

జిల్లాలో పెనుకొండ, పాలసముంద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర, రాళ్ల అనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగుళ్ల, టేకులోడు, ముత్యాలచెరువు పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కులను ఏపీఐఐసీ ఏర్పాటు చేసింది. భూములను సిద్ధం చేసింది. 4502.03 ఎకరాలు గుర్తించగా.. 3208 ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. 2509 ప్లాట్లను 1154 పరిశ్రమలకు కేటాయించింది. ఇంకా 1292 ప్లాట్లు, 1470 ఎకరాలు అందుబాటులో ఉంది. కప్పలబండ ఎంఎస్ఎంఈ పార్కులో 192 ప్లాట్లను 28 పరిశ్రమలకు కేటాయించింది. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఏపీఐఐసీ కల్పించినా.. కేవలం సీఎన్‌జీ గ్యాస్ బంకు మాత్రమే ఏర్పాటు చేశారు. మిగిలిన వారు ప్లాట్లు తీసుకుని, పరిశ్రమల ఏర్పాటుకు ముందుకురాలేదు. కొటిపి ఎంఎస్ఎంఈ పార్కులో 283 ప్లాట్లకుగాను 66 ప్లాట్లు తీసుకున్న ఔత్సాహికులు చాలామంది పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. ఎయిర్‌బస్, వీరా ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థలు సైతం వందలాది ఎకరాల భూములు తీసుకుని, పరిశ్రమలు పెట్టలేదు. భూములు కూడా వెనక్కివ్వలేదు. జిల్లావ్యాప్తంగా భూములు, ప్లాట్లు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయని వాటిని ఏపీఐఐసీ గుర్తించి, చర్యలు ప్రారంభించింది. తీసుకున్న భూముల్లో నిబంధనల మేరకు పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిందేనని తెగేసి చెబుతోంది. పరిశ్రమలైనా ఏర్పాటు చేయాలనీ, భూములైనా వెనక్కివ్వాలని నోటీసులు జారీ చేస్తోంది.



నోటీసులు జారీ చేశాం

జిల్లాలో పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్లాట్లు, భూములు తీసుకుని గడువులోపు పరిశ్రమలు ఏర్పాటు చేయని వారిని గుర్తించాం. ఇప్పటికే వీరా ఎలక్ట్రిక్ బస్సు తయారీ, ఎయిర్‌బస్ పరిశ్రమలతోపాటు కప్పలబండ, గుడిపల్లి, కొటిపి ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్లాట్లు తీసుకుని గడువు ముగిసిన వందకుపైగా పారిశ్రామికవేత్తలకు నోటీసులు జారీ చేశాం. ఆయా భూములు, ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిందే. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకొస్తే భూములు, ప్లాట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

- సుహానాసోనీ, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

చవితి ఖర్చు రూ.10కోట్లు

పురంలో వీధివీధినా వినాయక మండపాలు

కొన్నింటికి లక్ష వరకు ఖర్చు

వ్యాపారులకు గిరాకీ


హిందూపురం, సెప్టెంబరు 12: పట్టణంలో వినాయక చవితి ఎంతో ప్రత్యేకంగా చేసుకుంటారు. భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. ఏటా వినాయక చవితి పురస్కరించుకుని పట్టణంతోపాటు నియోజకవర్గంలో వందల సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. గతంలోకంటే ఈ ఏడాది విగ్రహాల సంఖ్య పెంచారు. ఏడురోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పల్లె, పట్టణం తేడాలేకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి నిమజ్జనం ముగిసేవరకు భారీ ఎత్తున ఖర్చుచేస్తారు. ఆఖరిరోజు గణనాథుని విగ్రహాన్ని వాహనంలో అలంకరించి డీజేలు వెంటబెట్టుకుని ఊరేగింపుగా వెళ్తారు. వినాయక విగ్రహం కొనుగోలుతో మొదలుకుని నిమజ్జనం వరకు ఆర్భాటంగా పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఒకప్పుడు పల్లెకు ఒకటి, పట్టణంలో పదిలోపు విగ్రహాలను ఏర్పాటు చేసేవారు. రానురాను వీధికో వినాయకుడిని కొలువుదీరుస్తున్నారు. పల్లెల్లో అయితే ఒకే వీధిలో రెండు, మూడు చోట్ల సైతం ఏర్పాటు చేశారు. విగ్రహాలు ఒకరి కంటే మరొకరు మిన్న అన్నట్లు సైజులు కొనుగోలు చేశారు. వీటిలో అనుమతులులేని మండపాలు సైతం చాలా ఉన్నాయి. జిల్లాలో ఐదోరోజుకు నిమజ్జనం ముగుస్తుంది. హిందూపురంలో ఏడోరోజు నిర్వహించడం ఆనవాయితీ. ఏడురోజుల పూజలనంతరం ఈసారి విగ్రహాలు శుక్రవారం నిమజ్జనానికి తరలనున్నాయి.

భారీగా ఖర్చు

గతానికి భిన్నంగా ఈ యేడాది వినాయక చతుర్థి ఉత్సవాలు సాగుతున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు హిందూపురం నియోజకవర్గంలో రూ.10కోట్లు ఖర్చుచేస్తున్నట్లు అంచనా. వినాయక విగ్రహాల కొనుగోలుకే రూ.4కోట్లదాకా ఖర్చుచేశారు. హిందూపురంలో రూ.20వేలు మొదలుకుని, రూ.10లక్షల విగ్రహాలు కూడా ఉన్నాయి. కొన్ని విగ్రహాల కూలిఖర్చే రూ.3లక్షల నుంచి రూ.4లక్షలదాకా వచ్చింది. మండపాల అలంకరణ, పూలు, పూజలకు లక్షల్లో ఖర్చుచేశారు. నియోజకవర్గంలో 500విగ్రహాలు ఏర్పాటు చేయగా.. 50విగ్రహాలు ఒక్కోటి రూ.10వేలుతో కొన్నారు. మిగిలినవన్నీ రూ.20వేల నుంచి రూ.5లక్షల దాకా ఉన్నాయి. పట్టణంలో 20విగ్రహాలు రూ.8లక్షల నుంచి రూ.12లక్షల దాకా విలువైనవి ఉన్నాయి. సగటున ఒక విగ్రహం కొనుగోలు, పూజలు, అందులో యువత ప్రత్యేక డ్రెస్సులు, డీజే, ఇతరత్రా రంగులకు సగటున రూ.3నుంచి రూ.5లక్షల దాకా ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. కొన్ని వినాయక మండపాల నిర్వాహకులు డీజేలకే రూ.50 వేల నుంచి రూ.3లక్షలదాకా ఖర్చుచేస్తున్నారు. హిందూపురంలోని ఒక విగ్రహంవద్ద ఉన్న యువత నిమజ్జనం రోజున ఊరేగింపుగా నృత్యం చేయడానికి ప్రత్యేకంగా కొనుగోలు చేసిన డ్రెస్సులు, రంగులు, టపాసులకు రూ.5లక్షలదాకా ఖర్చు చేశారు. ఈ లెక్కన ఎంత ఖర్చవుతుందో అర్థం చేసుకోవచ్చు. విగ్రహాలు ఏర్పాటు చేసిన లెక్కల ప్రకారం కొనుగోలు నుంచి నిమజ్జనం వరకు నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన విగ్రహాల ఖర్చు రూ.10కోట్లదాకా ఉంటుంది.

వీటికి ఖర్చెక్కువ..

ఈసారి ఏ వినాయక మండపానికి వెళ్లినా నూతనంగా మండపాలు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల మండపాల వద్ద విద్యుత్ దీపాల అలంకరణకు ఏడురోజులకు సుమారు రూ.20వేలు ఖర్చుచేయగా.. మండపం, షామియానాలు, కుర్చీలు, పూల ఖర్చు మరో రూ.30వేలు ఉంటుంది. భారీ విగ్రహాలు ట్రాక్టర్ ట్రాలీల్లోనే ఉంచారు. వీటికి ఏడు రోజులకుగాను రూ.20నుంచి రూ.30వేలదాకా బాడుగ చెల్లిస్తున్నారు. ఏడు రోజులపాటు పూలకే రూ.50వేల నుంచి రూ.లక్ష ఖర్చుచేశారు. ప్రతి విగ్రహానికి బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన పూలహారాలను ఏరోజుకారోజు పూజల్లో మార్చుతున్నారు. హిందూపురం పట్టణంలో కొన్ని విగ్రహాలకు ఒక్కో విగ్రహానికి హారం రూ.50వేల దాకా ఖర్చుచేస్తున్నారు. రంగులు, టపాసుల ఖర్చు తడిసి మోపెడవుతోంది.



పురంలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం

నిమజ్జనంరోజే రూ.3కోట్లు..

హిందూపురంలో నిమజ్జనం సందర్భంగా భారీ ఊరేగింపు ఉంటుంది. ఈసారి సుమారు వంద వినాయక మండపాల నిర్వాహకులు డీజేలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక డీజేకి రూ.50వేల నుంచి రూ.3లక్షల దాకా బాడుగ ఉంది. సగటున వంద విగ్రహాలకు రూ.కోటి ఖర్చవుతుంది. హిందూపురంలో వినాయక నిమజ్జనం సందర్భంగా సుమారు 5వేల మంది యువత ప్రత్యేక దుస్తులు, షూస్, కండువాలు, కంటద్దాలు కొనుగోలు చేస్తారు. వీటి ఖర్చు తక్కువన్నా రూ.30నుంచి రూ.లక్షలు ఉంటుంది. భారీ శబ్దాలు వచ్చే టపాసులకు రూ.50లక్షలకుపైగా ఖర్చు చేస్తారు. ఇతరాత్ర రంగులు, ఇకపోతే మద్యం కూడా భారీఎత్తున ఖర్చవుతుంది. వీటిని లెక్కిస్తే నిమజ్జనం రోజే రూ.3కోట్లు ఖర్చవుతుందని అంచనా.



హుండీ సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.72.48 లక్షలు

కదిరి, సెప్టెంబరు 12: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.72.48 లక్షలు వచ్చినట్టు ఈఓ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 43 రోజులకు హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయంలో లెక్కించారు. నగదుతోపాటు 24గ్రా. బంగారం, 807గ్రాముల వెండి, 24 అమెరికన్ డాలర్లు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి రమేష్‌బాబు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ్ బ్యాంకు మేనేజర్ చలపతిరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిగిచెర్ల విద్యార్థినికి బంగారు పతకం


పతకాలతో విద్యార్థినులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12: మండలంలోని చిగిచెర్ల విద్యార్థినులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. చెన్నైలో ఈనెల 10వతేదీ నుంచి ఖేలో ఇండియా సౌత్‌జోన్ జాతీయస్థాయి సబ్‌జూనియర్ జూడో పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని నందిని 32 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. లాస్యారెడ్డి 44 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్ తదితరులు అభినందించారు.

ఆరుతడి పంటలు సాగు చేయండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 12: ఆరుతడి పంటలు సాగుచేయాలని జిల్లా వ్యవయాధికారి ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. గురువారం రోటరీపురం గ్రామంలో కూరగాయలు, పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. భూగర్భజలాలు అడుగంటిపోతున్న తరుణంలో వరి పంట వేయడం లాభాదాయకం కాదన్నారు. రైతులు వరిని తగ్గించి ఆరుతడి పంటల సాగు చేయడం మంచిదన్నారు. ఈనెల 15వ తేదీలోగా కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా రైతుల సాగు చేసే పంటలను ఈ క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓశ్యాం సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 941 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 12: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 941 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 831 క్యూసెక్కులు, మరువ నుంచి పీఏబీఆర్‌కు 70 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


కుళ్లాయప్ప (ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12: పట్టణంలోని యాదవవీధికి చెందిన కుళ్లాయప్ప (25) గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గొట్లూరుకు చెందిన నారాయణస్వామికి స్వల్పగాయాలయ్యాయి. కుళ్లాయప్ప, నారాయణస్వామి బేల్దార్లు. మండలంలోని రేగాటిపల్లిలో కారుషెడ్డు నిర్మాణ పనులకు వెళ్లారు. ఇనుపరేకుల షెడ్డుపైన సిమెంటు దిమ్మె నిర్మిస్తుండగా.. ఇంటిపైన ఉన్న మెయిన్‌లైన్ వైరుకు కుళ్లాయప్ప ప్రమాదవశాత్తు తగిలాడు. విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉనన నారాయణస్వామికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, మల్లిక దంపతుల ఇద్దరు కుమారుల్లో కుళ్లాయప్ప పెద్దవాడు. ఇతడికి వివాహం కాలేదు.

స్కాం వెనుక ఇద్దరు..?

పరీక్షల విభాగంలో సూత్రధారి.. డీసీఈబీలో పాత్రధారి

సొంత అజెండాతో నిధుల దోపిడీకి స్కెచ్

రూ.31.80 లక్షలేకాదు.. మరింత పక్కదారి

డీఈఓకు తెలియకుండానే నడిపించారా..?



అనంతపురం విద్య, సెప్టెంబరు 12: ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్ల ముద్రణ, సరఫరా వ్యవహారంలో జరిగిన అక్రమాల వెనుక ఇద్దరు ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. విద్యాశాఖ పరీక్షల విభాగంలో ఉండే ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లో... డీసీఈబీలో ఉండే మరో ఉన్నతాధికారి ఈ స్కాంను అమలు చేశారని విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. జిల్లా విద్యాశాఖ ప్రమేయం లేకుండానే ఈ తతంగం నడిచిందా..? ఈ విషయం డీఈఓకు తెలియదా..? లేక మరో కోణం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్ల ముద్రణ, సరఫరా వ్యవహారంలోనే కాకుండా, డీసీఈబీ నిధులను 10వ తరగతి పరీక్షలకు కూడా మళ్లించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు చెల్లించిన రూ.లక్షల ఫీజులు కొందరు అధికారుల జేబుల్లోకి చేరినట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు బయట పడే అవకాశం కనిపిస్తోంది.



ఎవరెవరు ఉన్నారు..?

జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ), పరీక్షల విభాగం జిల్లా విద్యాశాఖ పరిధిలోనే ఉంటాయి. ఈ రెండు విభాగాల నిర్ణయాలు, వాటి అమలు డీఈఓ పర్యవేక్షణలోనే జరుగుతాయి. కానీ జిల్లాలో ఇందుకు భిన్నంగా వ్యవహారాలు సాగుతున్నాయి. ఈ రెండు విభాగాలు పరీక్షల విభాగంలో పనిచేసే ఓ అధికారి కనుసన్నల్లో నడుస్తున్నాయి. జిల్లాలో ప్రధానోపాధ్యాయులను, సంఘాల నాయకులను కదిలిస్తే ఈ విషయం స్పష్టమౌతోంది. డీసీఈబీలో రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్‌ను డీఈఓ సంతకాలు లేకుండా సృష్టించారు. దీని వెనుక డీసీఈబీ అధికారులు ఉన్నారని, పరీక్షల విభాగంలోని ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందని అంటున్నారు. డీసీఈబీ అధికారులు మాత్రమే డీఈఓ పేరు లేకుండా, జిల్లా విద్యాశాఖలోని ఏడీలు, సూపరింటెండెంట్స్, ఇతర క్లర్కుల సంతకాలు లేకుండా...కేవలం ఒక్కరి సంతకంతో రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్, ఇతర బిల్లులు సృష్టించి ఉంటారన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి.

దారి మళ్లించారా..?

ప్రతి ఏటా 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా బడ్జెట్ విడుదల చేస్తారు. ఆ నిధులే కాకుండా డీసీఈబీ నిధులను సైతం పది పరీక్షలకు వాడుకుటున్న ఆరోపణలు వస్తున్నాయి. డీసీఈబీ నిధులలో రూ.4 లక్షల వరకూ ఇలా పక్కదారి పట్టించారని సమాచారం. డీసీఈబీ నిధులు వాడుకుంటే రీఫండ్ చేయాలి. కానీ అడ్డదారిలో పరీక్షల కోసం వాడుకుని, ఇప్పటి వరకూ డీసీఈబీకి రీఫండ్ చేయలేదని అంటున్నారు. కొందరు అధికారులు ఏకమై.. సొంత అజెండాలో భాగంగా ఈ స్కాంకు రూపకల్పన చేసి అమలు చేసినట్లు కనిపిస్తోంది.

విచారిస్తే వెలుగులోకి..



జిల్లా విద్యాశాఖలో చాలా అక్రమాలు జరుగుతున్నాయి. డీసీఈబీలో లక్షలాది రూపాయల నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సరఫరాలో భారీ స్కాం జరిగినట్లు తెలిసింది. దీనిపై విద్యాశాఖ కమిషనర్ విచారణకు దిగాలి. లోతైన దర్యాప్తు చేస్తే ఈ స్కాం బయటకు వస్తుంది. త్వరలోనే దీనిపై ఉద్యమం చేస్తాం.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్రిమినల్ కేసులు పెట్టాలి..



జిల్లా డీఈఓగా వరలక్ష్మి ఫిబ్రవరిలో వచ్చారు. అలాంటప్పుడు డీఈఓ పేరిట డిసెంబరులోనే ఎలా వర్క్ ఆర్డర్ తయారు చేస్తారు..? దీని వెనుక ఎవరున్నారో తేల్చాలి. రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్‌కు నకిలీ ఉత్తర్వులు సృష్టించారు. ఇది నేరం. లోతైన విచారణ చేయాలి. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి..



డీఈఓ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారింది. డీసీఈబీలో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సొంత నిర్ణయాలతో లక్షలాది రూపాయలు దారి మళ్లిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలి. రూ.31.80 లక్షల స్కాంపై విచారణ చేయించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా చూడాలి.

- నరేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదర్శ కమ్యూనిస్టు

సీతారాం ఏచూరి

ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 12: విద్యార్థి దశ నుంచి తుది శ్వాస విడిచే వరకు పేదల పక్షాన ఉద్యమించిన ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. గురువారం సాయంత్రం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గణేనాయక్ భవన్‌లో సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శకత్వంలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎదిగారన్నారు. మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాల ప్రమాదాన్ని దేశ ప్రజలకు సూటిగా వివరించేవారన్నారు. వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఏకం చేసి ఇండియా వేదికను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో జరిగిన అనేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారన్నారు. సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సీతారాం ఏచూరికి నివాళులర్పించడంతోపాటు సంతాపసభలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, నగర కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు..

అనంతపురం విద్య: సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉంటూ దేశ రాజకీయాల్లో గొప్పనాయకుడిగా వెలిగారన్నారు. ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి తమ సంతాపం తెలుపుతున్నామన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు: కాలవ

అనంతపురం అర్బన్: సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవిత కాలం అలుపెరగని పోరాటం సాగించిన ఆయన మరణం దురదృష్టకరమన్నారు. తెలుగుగడ్డపై పుట్టిన ఆయన విద్యార్థి దశ నుంచి మంచి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. పార్లమెంట్‌లో, బయట ప్రజల గొంతుకగా నిలిచారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

ఐఏబీ సమావేశం వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: ఐఏబీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ గురువారం తెలిపారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల ప్రజాప్రతినిధులు వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో సమావేశాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీ ప్రకటిస్తామన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తిరూరల్, సెప్టెంబరు 12: మండలంలోని కంది, ఆముదం, వేరుశనగ పంటలను రేకులకుంట శాస్త్రవేత్తలు విజయశంకర్, భాస్కర్‌రావు, లక్ష్మణ్ గురువారం పరిశీలించారు. కంది, ఆముదం, వేరుశనగ పంటలను చీడ పీడలు ఆశించాయని రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కందిలో ఫ్యూసేరియం విల్ట్‌ను గుర్తించి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచ్చికారి చేయాలని వారు రైతులకు సూచించారు. అదేవిధంగా ఆముదం పంటలో కాప్సూల్ బోరర్‌ను గుర్తించి నివారణకు ప్రొఫెనోఫోస్ రెండు ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మెహరుషా బేగం, ఏఈఓ కృష్ణభగవన్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, సెప్టెంబరు 12: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 3200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.21, కనిష్ఠ ధర రూ.15పలికినట్లు ఆయన తెలిపారు.

ఇషాన్ సెంచరీ.. చేరువలో షాంశ్ ములాని

ముకేష్ కుమార్‌కు మూడు వికెట్లు

తరలివచ్చిన విద్యార్థులు, అభిమానులు




ఇషాన్.. శతకానందం..


ములాని.. 88 నాటౌట్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: దులీప్‌ట్రోఫీలో ఇషాన్ కిషన్, షాంశ్ ములాని, ఇంద్రజిత్ రాణించారు. ఇండియా బి, ఇండియా సి జట్ల మధ్య స్థానిక అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ బీలో మ్యాచ్ గురువారం ప్రారంభమైంది. టాస్ గెలిచి ఇండియా బి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా సి జట్టు మొదటి రోజు ఆటముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 357 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 46 పరుగులు చేసి రిటైర్డ్‌హర్ట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 43, రజత్ పటీదార్ 40, ఇంద్రజిత్ 78 పరుగులు చేశారు. ఇషాన్ కిషన్ ఇండియా బి జట్టు బౌలర్లపై విరుచుకపడ్డాడు. 126 బంతుల్లో 14 బౌండరీలు, 3 సిక్సర్లతో 111 పరుగులు చేశాడు. ఆటముగిసే సమయానికి బ్యాటింగ్‌కు వచ్చిన రుతురాజ్‌గైక్వాడ్ 46 పరుగులు, మానవ్‌సుతార్ 8 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇండియా బి బౌలర్లు ముకేష్‌కుమార్ 3 వికెట్లు, నవదీప్‌సైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ పడగొట్టారు.

ఏసీజీలోని ఏ మైదానంలో ఇండియా ఎ, ఇండియా డి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఇండియా డి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా ఏ జట్టు తొలిరోజు ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. షాంశ్‌ములాని 88 పరుగులు, ఖలీల్ అహ్మద్ 14 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ప్రథమ్‌సింగ్ 7, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 7, తిలక్‌వర్మ 10, రియాన్ పరాగ్ 37, షాషావత్ రావత్ 15, కుషార్గ్ 28, తునుష్‌కొటియాన్ 53, ప్రసిద్‌క్రిష్ణ 8 పరుగులు చేశారు. షాంశ్‌ములాని 8 బౌండరీలు, 3 సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. ఇండియా డి బౌలర్లలో హర్షిత్‌రాణా, విద్వత్ కావేరప్ప, అర్షదీప్‌సింగ్ చెరో రెండు వికెట్లు తీశారు. శరన్‌జైన్, సౌరభ్‌కుమార్ చెరో వికెట్ పడగొట్టారు. క్రికెట్ అభిమానులు, విద్యార్థులు పెద్దఎత్తున మ్యాచ్‌ను చూసేందుకు తరలివచ్చారు. ఈలలు వేస్తూ సందడి చేశారు. దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, మాంచోఫెర్రర్, పగడాల మల్లికార్జున, ఏజేపీ తీర్థ, మచ్చా రామలింగారెడ్డి, తిమ్మప్ప, రాజగోపాల్, ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ హరికుమార్ తదితరులు మ్యాచ్‌ను వీక్షించారు.




మ్యాచ్‌ను వీక్షిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు



పీవీ చౌదరి సేవలు మరువలేనివి

సంతాపసభలో కాలవ, దగ్గుపాటి, పల్లె


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తదితరులు

కొత్తచెరువు, సెప్టెంబరు 12: మాజీ ఎంపీపీ పీవీచౌదరి సేవలు మరువలేనివని రాయదుర్గం, అనంతపురం ఎమ్మెల్యేలు కాల్వశ్రీనివాసులు, దగ్గుపాటిప్రసాద్, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన సంతాపసభను కుటుంబసభ్యులు పీవీప్రసాద్, పీవీ రాంప్రసాద్, లక్ష్మీ, జ్యోతి, పీవీ శ్రీదేవి, శ్రీధర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవీ చౌదరి రెండు పర్యాయాలు ఎంపీపీగా ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించారన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య, గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ గౌసమొద్దీన్, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, కర్ణాటక అడిషనల్ డీజీపీ చంద్రశేఖర్, కర్ణాటక సిటీ మాజీ కమిషనర్ రామాంజినేయులు, టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలంనరసానాయుడు, నాయకులు ఎల్ నరేంద్రచౌదరి, శ్రీధర్‌చౌదరి, మంత్రిసవిత భర్త వెంకటేశ్వరరావు, సప్తగిరి బల్లా సురేశ్‌నాయుడు, సింగవరం రవి, వెంకటరెడ్డి తదితరులు పీవీ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నోటీసు

పుట్టపర్తి, సెప్టెంబరు 12: జీఓ నంబరు 85ను రద్దు చేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రా(పీహెచ్‌సీ)ల్లో పనిచేసే వైద్యులు.. జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ తిప్పయ్యకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు.. స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయానికి చేరుకుని, నోటీసు అందజేశారు. గ్రామీణ, ట్రైబల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యుల సర్వీస్ కోటాకు నష్టం వాటిల్లేలా 85 జీఓ ఉందని డాక్టర్ రామకృష్ణ అన్నారు. వెంటనే రద్దు చేయాలని కోరారు.

వినాయక మండపం వద్ద కొడవలితో హల్‌చల్

స్పీకర్ల సౌండ్ తగ్గించాలని స్థానికుడి మండిపాటు

నిర్వాహకులతో గొడవ.. యువకుడికి గాయాలు

హిందూపురం, సెప్టెంబరు 12: వినాయక మండపం వద్ద లౌడ్ స్పీకర్ల సౌండ్ తగ్గించలేదని నిర్వాహకులపై స్థానికుడు మండిపడ్డాడు. కొడవలితో వారిపైకి వెళ్లాడు. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక లక్ష్మీపురంలోని భజనమందిరం సమీపాన వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 10 గంటలు దాటినా లౌడ్‌స్పీకర్లు పెట్టి సౌండ్ ఎక్కువ పెట్టారు. సమీపంలోనే నివాసముంటున్న శ్రీహరి అనే వ్యక్తి తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సౌండ్ తగ్గించాలని వినాయక మండల నిర్వాహకులను పలుమార్లు శ్రీహరి కోరాడు. వారు తగ్గించకపోవడంతో ఇంట్లోని కొడవలి తీసుకుని, మండపం వద్ద హల్‌చల్ చేశాడు. అక్కడున్నవారు అడ్డుకున్నారు. ఈ సందర్భంలో పాండురంగ అనే యువకుడి చేతికి స్వల్పగాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న శ్రీహరికి స్థానికులు దేహశుద్ధి చేసి, టూటౌన్ పోలీసులకు అప్పగించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

దొంగ అన్నందుకు కత్తితో దాడి

హిందూపురం, సెప్టెంబరు 12: స్థానిక రహమత్‌పురానికి చెందిన ఇంతియాజ్‌పై అల్లాబకాష్ అలియాస్ అల్లు అనే యువకుడు బుధవారం అర్ధరాత్రి కత్తితో దాడిచేశాడు. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. రహమత్‌పురంలో అల్లాబకష్‌ను ఇంతియాజ్ దొంగ అన్నాడు. దీంతో తీవ్ర కోపంతో రగిలిన అల్లాబకష్ పక్కన మటన్‌షాపులోని కత్తి తీసుకుని, కుడిచేయి మీద నరికాడు. కడుపు, వీపుభాగంలో కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కాగా.. పక్కనే ఉన్నవారు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంతియాజ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తీసుకెళ్లారు. కత్తితో దాడిచేసిన అల్లాబకష్ ద్విచక్రవాహనాల చోరీ కేసులో ఉన్నాడు. వీరిద్దరు తాగిన మైకంలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గోరంట్ల, సెప్టెంబరు 12: మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన శశికళాబాయి అదృశ్యమైనట్లు సీఐ శేఖర్ తెలిపారు. శంకర్‌నాయక్ కుమార్తె శశికళాబాయి బూదిలి వద్ద ఉన్న కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తోంది. ఈనెల 10న ఉదయం ఉద్యోగానికి వెళ్లి ఇంటికి రాలేదు. బంధువుల వద్ద ఆరాతీసినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

15న ధర్మవరానికి మంత్రి సత్యకుమార్ రాక

ధర్మవరం, సెప్టెంబరు 12: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 15న ధర్మవరానికి రానున్నట్టు డీపీఆర్ఓ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వతేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12: ఉమ్మడి జిల్లా పరిధిలోని కోర్టులలో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల ప్రమాద కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, ఇతర రాజీ చేయదగ్గ వివాదాలను రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

బదిలీల గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12: ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును రాష్ట్ర ప్రభుత్వ పొడగించింది. తొలుత ఆగస్టు 15 నుంచి 31 వరకు బదిలీలకు అవకాశం కల్పించారు. తిరిగి సెప్టెంబరు 1వతేదీ నుంచి 15వతేదీలోగా ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు. రేపటిలోగా బదిలీలు మొత్తం కొలిక్కి వస్తాయని అందరూ ఉత్కంఠగా ఎదురుచూశారు. బదిలీలకు సంబంధించి మరోసారి గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 15 శాఖలకు సంబంధించిన ఉద్యోగుల బదిలీలు ఈనెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని ఆ శాఖలకు 23 నుంచి బదిలీలకు నిషేదం వర్తిస్తుందని సీఎస్ అధికారికంగా గురువారం ఉత్తర్వులను కలెక్టర్లకు పంపారు. ఒక్క ఎక్సైజ్ శాఖకు సంబంధించిన బదిలీలకు నెలాఖరు వరకు అవకాశం ఇచ్చారు. అక్టోబరు 1వ తేదీ నుంచి ఎక్సైజ్‌శాఖలో బదిలీలకు నిషేధం ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు.

విశాలా ఫెర్రర్‌కు స్పెయిన్ వర్సిటీ డాక్టరేట్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: ఆర్డీటీ మహిళా సాధికారత విభాగ డైరెక్టర్ విశాలా ఫెర్రర్‌కు స్పెయిన్‌లో గౌరవ డాక్టరేట్ దక్కింది. స్పెయిన్‌కు చెందిన బూర్గోస్ సిటీ యూనివర్సిటీ ఆఫ్ బర్గోస్‌లో గురువారం ఆమె డాక్టరేట్ అందుకున్నారు. మహిళల హక్కులు, సమానత్వంపై విశేషకృషి చేస్తున్న విశాలా ఫెర్రర్‌కు డాక్టరేట్ లభించింది.

వీధికుక్కల బెడద

కదిరి (అమడగూరు), సెప్టెంబరు 12: అమడగూరులో వీధికుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువ అవుతోంది. గుంపులు.. గుంపులుగా వీధుల్లో తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఒంటరిగా వెళ్తున్న చిన్నారులు, మహిళలపై దాడులు చేస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్తున్న వారిని వెంబడించి కరుస్తున్నాయి. వాటి నుంచి తప్పించుకోవడానికి వాహదారులు వేగంగా వెళ్తూ.. అదుపు తప్పి.. కిందపడి గాయపడుతున్నారు. మరికొందరు కుక్కకాటుకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం ఉదయం ప్రజలు వాకింగ్‌కు వెళ్లిన వారిని.. అక్కడి కుక్కల గుంపు వెంబడించాయి. రాత్రి సమయంలో గుంపుగుంపుగా వీధుల్లో తిరుగుతూ.. ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల బెడద నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా పరిషత్ పాఠశాలలో సంచరిస్తున్న వీధికుక్కలు

సీతారాం ఏచూరికి ఘన నివాళి



ఓడీసీలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు సున్నంపల్లి రమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, నరసింహులు పాల్గొన్నారు. సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజనేయులు పేర్కొన్నారు.
కదిరి అర్బన్ : సీతారాం ఏచూరికి సీపీఎం నాయకులు సుబ్బిరెడ్డి, సీపీఐ వేమయ్యయాదవ్ ఒక ప్రకటనలో నివాళులర్పించారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

కదిరి అర్బన్, సెప్టెంబరు 12: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి రైతు సేవా కేంద్రంలో సబ్సిడీతో ఉలవలు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు, టీడీపీ నాయకులు గంగులప్ప, పుల్లయ్య, భాస్కర్, భార్గవ్ పాల్గొన్నారు.
నంబులపూలకుంట: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం ఉలవలను పంపిణీ చేసినట్లు ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలానికి 400 క్వింటాళ్ల మంజూరయ్యాయని, శుక్రవారం కూడా ఉలవలను 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తామని అన్నారు.
గాండ్లపెంట: మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో గురువారం ఉలవలు పంపిణీ చేసినట్లు ఏఓ లక్ష్మీప్రియ తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకుని ఉలవలు పొందాలన్నారు. ఒక్కో రైతుకు 10 కేజీల ఉలవలు ఇస్తామన్నారు.

ఇళ్ల మధ్యే మురుగునీరు



ఎం.కొత్తపల్లి ప్రధాన వీధిలో నిలువ ఉన్న మురుగునీరు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 12: మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో ప్రధాన వీధిలో వర్షపునీరు, మురుగునీరు నిలువ ఉంటోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలోనే కుంటను తలపించేలా నీరు నిలువ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. దోమలు విపరీతంగా పెరిగి గ్రామస్థులు జ్వరాల బారిన పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి నిలువ ఉన్న నీటిని తొలగించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

ధర్మవరం: స్థానిక శాంతినగర్‌కు చెందిన మల్లికార్జున.. మద్యం సేవించి, ఆ మత్తులో భార్యపై దాడి చేశాడు. దీంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మల్లికార్జున కూలీ మగ్గంనేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. రోజు తాగి ఇంటికి వచ్చేవాడు. గురువారమూ తాగి ఇంటికి వచ్చిన అతను.. భార్య పద్మావతిని కట్టెతో కొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత ప్రారంభించారు. విజేతలను మండలస్థాయి జట్టుకు ఎంపికచేశారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

కదిరి: పట్టణంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం సభ్యులు విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం చేశారు. గురువారం ఆ సంఘం తరపున రూ.20వేల చెక్కును ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఆయన నివాసంలో అందించారు. ఈకార్యక్రమంలో గంగన్న, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న మాజీ సైనికులు



కురమాలలో గోడలకే పరిమితమైన సచివాలయం



పిల్లర్లకే పరిమితమైన విలేజ్ క్లినిక్ భవనం



పునాదుల వద్ద ఆగిన రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణం

ఎప్పటికి పూర్తయ్యేనో..!

- నత్తనడకన భవన నిర్మాణాలు
- ఐదేళ్లయినా పూర్తిగాని వైనం
- ప్రజాధనం వృథా
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నల్లమాడ, సెప్టెంబరు 12 : గత వైసీపీ ప్రభుత్వం మండలంలో సచివాలయం, విలేజ్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాల కోసం ప్రారంభించిన భవన నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. కేటాయించిన నిధులను కాంట్రాక్టర్లకు సక్రమంగా మంజూరు చేయకపోవడంతో భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో ప్రజా ధనం వృథా అయింది. ప్రస్తుత కూటమి పాలకులైనా స్పందించి.. ఆగిపోయిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండలానికి 13 సచివాలయాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి రూ.43.60 లక్షలను కేటాయించింది. ఇందులో కురమాల సచివాలయ భవన నిర్మాణం గోడల వరకు జరిగి నిలిచిపోయింది. అలాగే వేళ్లమద్ది సచివాలయం బేసిమట్టం లేవల్‌లోనే ఆగిపోయింది. దొన్నికోట సచివాలయం పిల్లర్లు.. గుంతలకు మాత్రం పరిమితమైంది.

ఇక మండలానికి 12 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు మంజూరయ్యాయి. ఒక్కొక్క విలేజీ క్లీనిక్ భవన నిర్మాణానికి రూ.17.80 లక్షల మంజూరైంది. ఇందులో దొన్నికోట, గోపేపల్లి, చారుపల్లి, విలేజ్ క్లీనిక్‌ల భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. కురమాలలో రెటల్ వరకు, పులగంపల్లిలో స్లాబ్‌వరకు పనులు జరిగి ఆగిపోయాయి. విలేజ్ క్లీనిక్‌లను అద్దె గదులు, ఆర్డీటీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో సౌకర్యాల కొరతతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే మండలానికి 13 రైతు భరోసా కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణానికి రూ.23.60 లక్షలు మంజూరు చేశారు. ఇందులో వంకరకుంటలో స్లాబ్‌వరకే పనులు జరిగాయి. పులగంపల్లి బేసిమట్టం వరకు పనులు జరిగి నిలిచిపోయాయి. గోపేపల్లి, కురమాల, దొన్నికోటల్లో పనులే ప్రారంభించలేదు.

నిధుల కొరత

అప్పట్లో కొన్ని భవన నిర్మాణాలు నిధుల కొరత వల్ల పూర్తిగా.. మరి కొన్ని మధ్యలో ఆగిపోయాయి. నిధులు విడుదల అయితే వాటిని నిర్మాణాలను పూర్తి చేస్తాం.
- గురురాజు గుప్తా, పీఆర్ జేఈ

నీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



కార్మికుల నిరసనలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు

పుట్టపర్తి, సెప్టెంబరు 12 : శ్రీసత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులకు జీతం మాత్రమే ఇస్తే సరిపోదని, కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హనుమాన్ సర్కిల్‌లో కార్మికులు ఎనిమిదో రోజైన గురువారమూ నిరసనను కొనసాగించారు. వారికి నరసింగరావుతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, తదితరులు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. నరసింగరావు మాట్లాడుతూ.. కార్మికులకు రావాల్సిన ఈఎస్‌ఐ, పీఎఫ్ నిధులను వెంటనే వారి ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. వాటర్ ప్రాజెక్టు నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వందలాది గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందలేదని, పైపులైన్‌కు నిర్వహణకు కార్మికుల జీతాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివ, లక్ష్మీనారాయణ, గంగాధర్, కార్మికుల నాయకులు మధు, రమణ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉషశ్రీ చరణ్

గ్రామ పంచాయతీలకు నిధులివ్వండి

పుట్టపర్తి, సెప్టెంబరు 12: పెనుకొండ నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయించాలని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వైఎస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కోరారు. గురువారం ఆమె సర్పంచ్‌లతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి.. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలకు నిధులను విడుదల చేయరాదని మంత్రి సవిత అధికారులను ఆదేశించారని ఆరోపించారు. టీడీపీ కండువా వేసుకుంటే నిధులు విడుదల చేస్తామని తమ సర్పంచ్‌లతో మంత్రి పేర్కొన్నట్లుగా ఆమె తెలిపారు. సంబంధం లేని శాఖలో మంత్రి అజమాయిషీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్‌లైట్లు పారిశుధ్యం కోసం నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతుంటే సొంత నియోజకవర్గంలోనే మంత్రి సవిత నిర్ణయం ప్రజా వ్యతిరేకంగా ఉందని విమర్శించారు.

ముండ్లవారిపల్లిలో తాగునీటి ఎద్దడి



నీటి కోసం ట్యాంక్ వద్ద ఉంచిన బిందెలు

నంబులపూలకుంట: మండలంలోని ముండ్లవారి పల్లిలో కొన్నినెలలుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ గ్రామంలో 60 కుటుం బాలున్నాయి. రక్షిత తాగునీటి బోరు ఒక్కటే ఉంది. ప్రస్తుతం ఇందులో నీరు అరకొరగా ఉండటంతో.. చాలా సేపు మోటార్ ఆన్ చేస్తేగాని.... నాలుగు బిందెల నీళ్లు రావడం లేదు. దీంతో బిందెడు నీళ్ల కోసం గంటల తరబడి ట్యాంక్ వద్ద ఎదురు చూడాల్సి వస్తోంది. తప్పనిపరిస్థితుల్లో సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. తమ గ్రామంలో మరో బోరు వేసి.. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా.. పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

గాండ్లపెంట, సెప్టెంబరు 12 : స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో నల్లచెరువు సీడీపీఓ గంగరత్నమ్మ, ఇన్‌చార్జీ సూపర్‌వైజర్లు పార్వతమ్మ, రఫీస్నీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, సుజాత పాల్గొన్నారు.
తనకల్లు : మండలంలోని టి.సదుం పంచాయతీలోని ఎర్రచెరువు పల్లి గ్రామంలో గురువారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, పిల్లలు, గర్భవతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి సెప్టెంబరు 12 : గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ టీ ఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో గృహనిర్మాణం ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 72,353 గృహాలు నిర్మాణాలు చేపట్టగా ఇంతవరకు 22,756 పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన వాటిని వచ్చే సంవత్సరం మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 20 నాటికి 3,190 గృహాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేవిధంగా ఇంజనీర్లు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఈలు శంకర్‌లాలు శ్రీనివాస్, రమణారెడ్డి, శివకుమార్ నాయక్ పాల్గొన్నారు.

కొత్తచెరువులో వ్యక్తి హత్య

కొత్తచెరువు, సెప్టెంబరు 12 : మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన బూచర్ల నరసింహులు కుమారుడు బూచర్ల గంగాద్రి (40) కొత్తచెరువులో హత్యకు గురయ్యాడు. ఇతన్ని భార్య రెండేళ్ల క్రితం వదిలేసింది. దీంతో గంగాద్రి కొత్తచెరువులో ఉన్న చెల్లెలు వద్ద ఉంటున్నాడు. బేల్దారి పనులకు వెళ్తూ.. తాగుడుకు బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం ముగ్గురు స్నేహితులతో కలిసి మద్యం తాగి.. గొడవ పడ్డాడు. బుధవారం రాత్రి నుంచి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, సమీప బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో అతని మృతదేహం పడి ఉండటాన్ని గురువారం సాయంత్రం గమనించిన స్థానికులు పోలీసులు, అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గంగాద్రి ముఖంపై గాట్లు ఉండటాన్ని గమనించిన పోలీసులు దాన్ని హత్యగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా, గంగాద్రికి ఇద్దరు పిల్లలు. వారు మీర్జాపురంలో ఉన్న గంగాద్రి తల్లి వద్ద ఉంటున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 12: మండలంలోని రేగాటిపల్లి గ్రామానికి చెందిన షెక్షావలి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం షెక్షావలి, అతని భార్య సబీరా గొడవపడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన షెక్షావలి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యాసామగ్రి పంపిణీ



జానకంపల్లిలో విద్యాసామగ్రి అందజేస్తున్న నిర్వాహకులు

బుక్కపట్నం: మండలంలోని జానకంపల్లి ప్రాథమిక పాఠశాలలో పుట్టపర్తికి చెందిన కిద్‌మత్ ఏకలిక్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు షామీర్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువైన విద్యాసామగ్రిని గురువారం అందించారు. ఎన్టీఆర్ అభిమాని గోపీ జన్మదినం సంద ర్భంగా విద్యార్థులకు పలకలు, రైటింగ్ ప్యాడ్స్, నోట్ పుస్తకాలు, పెన్సిల్స్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు షాకీర్, అలీ, హెచ్‌ఎం సుకన్య, రేవతి పాల్గొన్నారు.

సీతారంపల్లిలో పగలే చోరీ

ఐదు తులాలు బంగారు, రూ. 80 వేలు అపహరణ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 12 : మండలంలోని సీతారంపల్లి గ్రామంలో గురువారం పట్టపగలే ఓ ఇంటిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రైతు పి.వసంతరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి రాగా, ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. వసంతరెడ్డి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా దుండగులు బీరువా పగలగొట్టి.. అందులోని ఐదు తులాల బంగారు నగలు, రూ. 80 వేలు నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

నేడు గుండె వైద్యశిబిరం

ధర్మవరం, సెప్టెంబరు 12: స్థానిక కొత్తపేట సీతారామాంజనేయస్వామి కల్యాణమండపంలో శుక్రవారం గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ రాయపాటి శివ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

17న నులిపురుగుల నివారణకు చర్యలు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 12: నులిపురుగుల నివారణ చర్యల్లో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి కమల్ రోహిత్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఈ కార్యక్రమంపై సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణ, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు పూల రెడ్డెప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, పీడీ గోపీనాథ్, పాల్గొన్నారు.

19న మధుమేహ పరీక్ష శిబిరం

ధర్మవరం, సెప్టెంబరు 12: స్థానిక ఆర్యవైశ్య కొత్తసత్రంలో ఈనెల 19న ఉచిత మధుమేహ, పాదముల స్పర్శ పరీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరాం పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

హోరాహోరీగా 'అటల్' క్రికెట్ టోర్నీ

ధర్మవరం: స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో అటల్ బీహారి వాజపేయి స్మారక క్రికెట్ టోర్నీ ఎనిమిదో రోజైన గురువారం హోరాహోరీగా సాగింది. మొదటి మ్యాచ్‌లో దంపెట్ల జట్టుపై గొట్లూరు జట్టు, రెండో మ్యాచ్‌లో రోద్దం జట్టుపై మేడాపురం జట్టు, మూడో మ్యాచ్ గొట్లూరు జట్టుపై మేడాపురం జట్టు, నాల్గవ మ్యాచ్‌లో ఎంజీ వారియర్స్ జట్టుపై పాయాజ్ జట్టు, ఐదో మ్యాచ్‌లో పాయాజ్ జట్టుపై 11 టీం జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు బీజేపీ నాయకులు అందించారు.

పంటల పరిశీలన

బుక్కపట్నం: మండలంలోని నారసింహపల్లి, తండా గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య గురువారం పరిశీలించారు. మొక్కజొన్న పంటకు టార్సికంబ్లట్ అనే వ్యాధి సోకిందని, దీని నివారణకు మ్యామ్‌కోజర్ రెండు గ్రాములను ఒక లీటర్‌నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే వరిలో ఆకుముడత పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు మిల్లీలీటర్లను ఒకలీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆయన వెంటే ఏఓ సతీష్‌బాబు, ఏఈఓలు సునీత, సుధాలక్ష్మీ, రైతులు ఉన్నారు.

బోరుబావుల్లో నీటి మట్టాల నమోదు

తనకల్లు: మండలంలోని గొళ్లపల్లి వాటర్‌షెడ్ పరిధిలో ఉన్న గొళ్లపల్లి, మల్లిరెడ్డిపల్లి, ఎర్రబల్లి గ్రామాల్లోని బోర్లలోని నీటి మట్టాలను కొలిచి.. నమోదు చేసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టు మేనేజర్ రాంప్రసాద్ మాట్లాడుతూ...ఈ యేడాది కురిసిన వర్షాన్ని లెక్కించి, అక్టోబరులో వాటర్ బడ్జెట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన 19 గ్రామాల్లో రైతులకు నీటి నిలువలో, నీటివాడకం, ఏఏరకాల పంటలు సాగు, ఒక్కొక్క పంటకు ఎంత నీరు అవసరం తదితర అంశాలపై అవగాహన కల్పించి, వాటర్ బడ్జెట్ నిర్వహిస్తామన్నారు.

కూటమి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 12 : విజయవాడలో వరద బాధితుల సాయం కోసం గురువారం మండలంలోని కొండకమర్లలో కూటమి నాయకులు విరాళాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు రోజుల పాటు విరాళాల సేకరణ చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పోగాకు జాకీర్ అహమ్మద్, జయచంద్రారెడ్డి, సంఘాల శ్రీనివాసులు, బాలక్రిష్ణారెడ్డి, శంకరప్ప, రవి, ఆంజనప్ప, శ్రీనివాసులు, వినోద్‌కుమార్‌నాయుడు, సుధాకర్‌నాయుడు, చంద్రాయుడు, గంగాధర్, ఈశ్వర్, చంద్ర, జనసేన కొండబోయన సతీష్, రాష్ట్ర బీసీ సెల్ అంజప్ప పాల్గొన్నారు.



కొండకమర్లలో విరాళాలు సేకరిస్తున్న కూటమి నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 12: గణేశ్ నిమజ్జనం సందర్భంగా పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ భూపతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక ప్రతిమలు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, విద్యుత్ తీగల తొలగింపు తదితర పనులు చేపడుతామన్నారు. కావున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండరాదన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 9440781837ను సంప్రదించాలని ఈఈ తెలిపారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి భూమిపూజ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 12: రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని భూమిపూజ చేయనున్నట్లు టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రొద్దం మండలం కందుకూర్లపల్లిలో ఉదయం 10గంటలకు రూ.1.20కోట్లతో సీసీరోడ్ల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పరిగి మండలం కొడిగేపల్లివద్ద జడ్పీ ఉన్న పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నా. ఈ కార్యక్రమీల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొనాలని శ్రీరాములు కోరారు.

ఉలవ విత్తనాలకు నమోదు చేసుకోండి

అగళి, సెప్టెంబరు 12: వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ యేడు ఖరీఫ్‌లో పంటలు సాగు చేయని రైతు లకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తోందని ఏఓ శేఖర్ నాయక్ తెలిపారు. అవసరైన రైతులు ఆయా రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఐదు కిలోల ఉలవల ధర రూ.870 కాగా 80శాతం రాయితీ రూ.696పోను రైతులు రూ.174ను ముందుగానే చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఉలవ విత్తనాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా పంట సాగు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువైద్యుల సూచనలు పాటించండి : డీడీ

గుడిబండ, సెప్టెంబరు 12 : పశువైద్యాధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాడి రైతులు తప్పక పాటించాలని వెటర్నరి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని పీఎన్ పాళ్యం, దేవరహట్టి, మద్దనకుంట తదితర గ్రామాల్లోని రైతులకు గురువారం పె య్యదూడల పుట్టుక, కృత్రిమ గర్భాదారణపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధికారి సుధాకర్, డా.అమర్, వెటర్నరి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షర్మిలతో ఇనాయతుల్లా భేటీ


షర్మిల నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఇనాయతుల్లా

హిందూపురం, సెప్టెంబరు 12: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంహెచ్ ఇనాయతుల్లా కలిశాడు. ఇటీవల డీసీసీ అధ్యక్షుడిగా తనను ప్రకటించడం పట్ల షర్మిలాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని షర్మిల చేతులమీదుగా అందుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని షర్మిల సూచించినట్లు ఆయన తెలిపారు.

వినాయక నిమజ్జనం సందర్భంగా
పలు గ్రామాల్లో ఘర్షణలు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 12 : వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం మండలంలోని కావేటి నాగేపల్లి, గుడిపల్లి, నడింపల్లి గ్రామాల్లో చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కావేటి నాగేపల్లిలో ఇరువర్గాల ఘర్షణలో పలువురు గాయపడ్డారని, 11మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గుడిపల్లిలో పలువురు యువకులు ఘర్షణపడ్డారని తెలిపారు. అలాగే నడింపల్లిలో ఒకే వర్గంవారు పరస్పరం దాడులకు తెగబడ్డారన్నారు. వీటిపై ఫిర్యాదులు అందడంతో గురువారం పోలీసులు విచారణ చేపట్టారు. విడివిడిగా పిలిపించి ఘర్షణపై వారిని హెచ్చరించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ సంఘటనలపై ఆయా వర్గాల వారితో మాట్లాడామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాలను రాజీచేయడానికి కొంతమంది నాయకులు రంగంలో దిగారు. దీంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణం జనంతో నిండిపోయింది.

యువకుడి ఆత్మహత్య

హిందూపురం, సెప్టెంబరు 12: పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన శ్రీధర్(22) ఇంట్లో పైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. శ్రీధర్ తొమ్మిది నెలల క్రితం చౌళూరుకు చెందిన నిహారికను వివాహం చేసుకున్నాడు. ఆమె చదువుకుంటోంది. శ్రీధర్ ఓ పరిశ్రమలో పనికి వెళ్తున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లింది. తల్లిదండ్రులు బెంగళూరుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎఎస్ఐ అక్బర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు. మంచి ఉద్యోగం రాలేదని తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

చిలమత్తూరు, సెప్టెంబరు 12: మండలంలోని కోడూరు తోపు సంత జరిగే ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు లైన్‌మన్ బాషా తెలిపారు. కోడూరు తోపులో గృహ అవసరాలకు ఏర్పాటుచేసిన 16 కేవీ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ని బుధవారం అర్థ రాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. విద్యుత్ సరఫరా అవుతున్న విద్యుత్ తీగలను కత్తిరించి ట్రాన్స్‌ఫార్మర్‌ని కిందకు పడేశారన్నారు. అందులో ఉన్న కాపర్ వైరు, ఆయిల్‌ని ఎత్తుకెళ్లారన్నారు. ఈ విషయంపై పోలీసులకు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా లేపాక్షి మండలంలో ఇదే సమయానికి మరో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ని ఎత్తుకెళ్లినట్లు లైన్‌మన్ తెలిపారు.

నేడు వినాయక నిమజ్జనం

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ రత్న


శోభయాత్ర జరిగే రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ

హిందూపురం, సెప్టెంబరు 12 : వినాయక చవితి పురస్కరించుకుని హిందూపురంలో ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జన కార్యక్రమం శుక్రవారం జరుగనుంది. ఈ సందర్భంగ్గా ఎస్పీ రత్న గురువారం సాయంత్రం వినాయక విగ్రహాలు తరలివెళ్లే రహదారులను పరిశీలించారు. శోభయాత్ర ఏర్పాట్లపై ఆరాతీశారు. అనంతరం గుడ్డం కోనేరువద్ద భద్రత ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌పై పరిశీలించారు. ముఖ్యంగా పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. వినాయకమండలి సభ్యులు సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. నిమజ్జనం సందర్భంగా నలుగురు డీఎస్పీలతోపాటు 30 మంది సీఐలు, వంద మంది ఎస్ఐలు, 200మంది ఏఎస్ఐలు, 300మంది హెడ్ కానిస్టేబుళ్లు, వజ్రావాహనం, స్పెషల్‌పార్టీ సిబ్బంది ఉంటారన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం ఉన్నారు.

పరిశీలించిన టీడీపీ నాయకులు

హిందూపురం: వినాయక నిమజ్జనం కోసం స్థానిక గుడ్డం కోనేరువద్ద ఏర్పాట్లను టీడీపీ నాయకులు పరిశీలించారు. జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ మాజీ ఛైర్మన్ అనిల్‌కుమార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు రమేష్, డైమండ్‌బాబు, నవీన్, సతీష్, గిరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై మునిసిపల్ అధికారులు, డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. గుడ్డం కోనేరువద్ద మునిసిపల్ అధికారులు నిమజ్జన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. కోనేరు చుట్టూ లైటింగ్, బారికేడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వచ్చే ముఖ్య అతిథుల కోసం డయాస్ ఏర్పాటు చేశారు. వీక్షించేందుకు వచ్చే భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మునిసిపల్ డీఈ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.


కోనేరు చుట్టూ బారికేడ్లు, లైట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

జగన్‌వి దిగజారుడు రాజకీయాలు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, సెప్టెంబరు 12: ప్రజలు కష్టాల్లో ఉండి బాధలు పడుతుంటే చూసి రాక్షసానందం పొందే వ్యక్తి జగన్ అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. అయితే కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉండి వారిని అన్ని విధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబును చూసి జీర్ణించుకోలేక శిశుపాలుడితో పోల్చడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. వారు గురువారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో ఇంత పెద్దఎత్తున వరదలు వచ్చినా, ఎక్కడా శవరాజకీయాలు చేసేందుకు అవకాశం ఇవ్వకుండా చంద్రబాబు కాపాడుతున్నారని జగన్ తీవ్ర ఆవేదనతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను పరామర్శించడం మాని, నేరారోపణపై జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగామసురేష్‌ను పరామర్శించి టీడీపీపై, చంద్రబాబుపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. వంద తప్పులు దాటుతున్నారని అంటున్న జగన్ వాటి బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన జగన్ మతిస్థిమితంలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే రాక్షసా నందం పొందుతూ, లండన్ టూర్ కోసం తహతహలాడుతున్న నీవు ఓ నాయకుడివా జగన్ అని మండిపడ్డారు. వరద బాధితులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కంటి మీద కునుకు లేకుండా శ్రమిస్తున్నారని, కష్టాల్లో ఉన్న ప్రజలకు నైతిక భరోసా కల్పించాల్సిన స్థానంలో ఉన్న నీవు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నావని జగన్‌పై మండిపడ్డారు. ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటున్న ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. వరదల వల్ల సర్వం కోల్పోయిన విజయవాడలోని బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందిం చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ బీఎం పాండురంగప్ప, ఉమేష్, మండల కన్వీనర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 12: మండల కేంద్రంలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం గురువారం సందర్శించింది. విద్యార్థులపై రసాయన స్ప్రే అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన వైద్యాధికారి హరికుమార్, విద్యాశాఖాధికారులు పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టారు. రసాయన స్ప్రే బారిన పడిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సంజీవరాయుడు ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షించారు. కళ్లమంటలు, తిమ్మిరికి సంబంధించి ఐడ్రాప్‌లు వేసి మందులు అందించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ విద్యార్థులపై రసాయన స్ప్రే వల్ల ఎక్కువ నష్టం కాలేదన్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అయితే కొంతమంది విద్యార్థులకు చికిత్సలు అందించామన్నారు. 15మంది విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థులు ఐ డ్రాప్స్ వేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.హెచ్ఎం మాట్లాడుతూ హఠాత్తుగా ఇద్దరు బాలురు స్కూల్‌లోకి చొరబడి ఈ ఘటనకు పాల్పడ్డారన్నారు. పట్టుకోబోతే పారిపోయారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మణూరు తండాలో వైద్యశిబిరం

మడకశిర రూరల్, సెప్టెంబరు 12: మండలంలోని మణూరు తండాలో కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్యశిబిరం నిర్వహించి, జ్వరాలు బారిన పడిన వారికి చికిత్సలు అందజేశారు. ఆంధ్ర జ్యోతిలో గురువారం 'మణూరు తండాలో విజృంభించిన జ్వరాలు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి వైద్య అధికారలు స్పందించారు. కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లు మాధుర్య, వినోద్ కుమార్ ఆధ్వర్యంలో తండాలో వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్నా వారికి రక్త పరీక్షలు నిర్వహించి, చికిత్సలు అందిం చారు. అదేవిధంగా తండాలోని పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు డాక్టరు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది తండాలో ఇంటింటికి పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది తండాలోని డ్రైనేజీలను శుభ్రంచేశారు. ఆ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి హాస్సేన్ బీ, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. తండావాసులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎస్ఐ సస్పెన్షన్

హిందూపురం, సెప్టెంబర్ 12: స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ బాలరాజును సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలవడినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. నదీపరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, ఇసుకను స్టేషన్ వద్ద డంప్ చేశారు. అయితే ఏఎస్ఐ బాలరాజు తన ఇంటి నిర్మాణం కోసం సీజ్ చేసిన ఇసుకను ఈ ఏడాది జులై 17న అప్‌గ్రేడ్‌పోలీస్ స్టేషన్ వ్దద నుంచి తరలించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'స్టేషన్‌వద్ద సీజ్ చేసిన ఇసుక మాయం' అనే కథనం వెలవడింది. దీనిపై అప్పట్లో ఎస్పీ సీరియస్‌గా పరిగణించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డీఐజీకి నివేదిక పంపారు. విచారించిన ఉన్నతాధికారులు... చేసిన తప్పు రుజువు కావడంతో గురువారం ఏఎస్ఐ బాలరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు .జారీ అయినట్లు డీఎస్పీ తెలిపారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుకొండ, సెప్టెంబరు 12 : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు కోరారు. ఈ మేరకు వారు గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో ఆర్ఐ రవికి వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు హరి, రమేష్, తిప్పన్న, మాబున్నిసా, రాజారావు తదితరులు కాలనీల్లో పర్యటించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఆర్ఐ రవికి వినతిపత్రం అందించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు నర్సారెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛగ్రామాలుగా మార్చడమే సీఎం లక్ష్యం : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, సెప్టెంబరు 12: రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకొన్నారని, అందుకోసమే ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొ న్నారు. మడకశిర జూనియర్ కళాశాల మైదానంలో గురువారం మడకశిర నియోజకవర్గం పరిధిలోని 30 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లను అందించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అలాగే వెనకబడిన మడకశిర లాంటి ప్రాంతంలో సైతం అత్యధిక మంది డీఎస్సీ ద్వారా అర్హత పొంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలన్న లక్ష్యంతోనే స్థానిక డిగ్రీ కళాశాలలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన గురువారం గుండుమల తిప్పేస్వామితో కలిసి డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు స్టడీ మెరీయల్‌ను పంపిణీ చేశారు.

నేడు అమరాపురంలో ఎమ్మెల్యే పర్యటన

మడకశిర(అమరాపురం): ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శుక్రవారం అమరాపురం మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్ తెలిపారు. ముందుగా వరసిద్ధి వినాయక మండపంలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం బస్టాండు ఆవరణంలో ఎన్టీఆర్ తాగునీటి వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: సీడీపీఓ


మాట్లాడుతున్న సీడీపీఓ రెడ్డిరమణమ్మ

చిలమత్తూరు, సెప్టెంబరు 12: సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. మండలంలోని పాలేపల్లిలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించా రు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందజేస్తోం దన్నారు. అలాగే నిత్యం పాలు, గుడ్లు, ఆకుకూరలు, చిరుదాన్యాలు విరివిగా తీసుకోవాలన్నారు. పిల్లలకు చిరుతిళ్లు అలవాటు చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శన చేసి, వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభారాణి, రామతులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరనిలోటు

● సీపీఎం నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాంఏచూరి మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం స్థానికనాయకులు పేర్కొన్నారు. సీపీఎం నాయకులు హరి, రమేష్, బాబావలి తదితరులు గురువారం మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధితో సీతారాం ఏచూరి మృతిచెందారన్నారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.

పాఠశాలల తనిఖీ

అగళి, సెప్టెంబరు 12: మండలంలోని ఇరిగేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పెనుకొండ డీవైఈఓ రంగయ్యతో కలిసి ప్లాన్ టీం వెళ్లి తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను ల్యాబ్, లైబ్రెరీ, ఉపాధ్యాయుల పాఠ్యాంశాల వివరాలు, డైరీస్, విద్యార్థులు మార్క్స్ రికార్డ్ తదితర వాటిని పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రొళ్ల : మండలకేంద్రంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను గురువారం ఎంఈఓ శ్రీధర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పాఠశాలలో మంజూరై నిర్మాణంలో ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్, పాఠశాతల వివిధ రకాల రికార్డులను పరిశీలించి తనిఖీ చేశారు.

రోడ్లపై మురుగునీటి ప్రవాహం

పెనుకొండ, సెప్టెంబరు 12: మేజర్ పంచాయతీ పెనుకొండ నగర పంచాయతీగా మారి దాదాపు మూడేళ్లు కావస్తున్నా అభివృద్ధిలో మాత్రం వెనుకంజలోనే ఉంది. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువలన్నీ దెబ్బతిని మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్గావీధిలోని ఏడో వార్డులో మురుగు కాలు వల నిండా ఇసుక పేరుకుపోయి నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దర్గా సర్కిల్‌లోను డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దానిని తొలగించాలని అనేకమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ కమిషనర్ వీటిపై దృష్టిసారించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని దర్గా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


ఏడో వార్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

వరద బాధితులకు సాయం



గోరంట్లలో విరాళాలు సేకరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 12: వరదలతో అతలాకుతలైన విజయవాడ ప్రాంత వాసులను ఆదుకుందామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్, బాలాజీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, మెయిన్ బజార్‌లలో బుధవారం వరద బాధితుల సహాయార్థం వారు విరాళాలు సేకరించారు. రూ.30270 వసూలు చేశామని ఈ మొత్తాన్ని వరదబాధితుల సహాయ నిధికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు సమీవుల్లా, కమల్‌బాష, చాంద్‌బాషా, గంగాధర్, శీనప్ప, శివకుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని గుమ్మయ్యగారిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నుంచి గోరంట్ల ప్రధాన రహదారిపై వరదబాధితుల కోసం కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజలనుంచి గురువారం విరాళాలు సేకరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వర్ణలత, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, కార్మికులు విరాళాలు సేకరించారు. రూ. 15,300 విరాళాలు సేకరించామని, ఈమొత్తాన్ని తమ సీఎం సహాయ నిధికి అందజేయనున్నట్లు తెలిపారు.

అగళి : విజయవాడ వరద బాధితుల కోసం మండల పరిధిలోని కోడిపల్లి పంచాయతీ జంగమరణపల్లి వాసులు రూ.11,841 అందజేశారు. దానిని గురువారం ముఖ్యమంత్రి సహాయనిధికి పంపినట్లు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి సహకరించాలి: కమిషనర్


కోనాపురం రోడ్డును పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్, టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 12: పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే రోడ్డు నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. పెనుకొండ నగర పంచాయతీ రోడ్డు నుంచి కోనాపురం వెళ్లే రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇటీడీపీ మడకశిర రహదారిలోని ఎగువ ప్రాంతం నుంచి మురుగు కాలువపై కల్వర్టు బ్లాక్ అయి మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు అప్రమత్తమైన మునిసిపల్ అధికారులు, టీడీపీ నాయకులు మురుగు నీరును డైవర్ట్ చేశారు. అప్పటి నుంచి కోనాపురం వెళ్లే రహదారిలో డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మునిసిపల్ అధికారులు గురువారం టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులతో కలిసి డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. త్వరలోనే కోనాపురం రోడ్డు నిర్మాణం మంజూరవుతుందని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను గుర్తించాలి

కార్యకర్తలకు బీజేపీ నాయకుల సూచన

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 12: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం సోకం ప్రభుత్వానికి తెలియజేయాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ నాయకులు సూచించారు. హిందూ పురం మడకశిర, పెనుకొండ నియోజక బూత్ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బుధవారం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. అలాగే ఎక్కువమందితో బీజేపీ సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట శివనారాయణ, బాలకృష్ణ యాదవ్, సభ్యత్వ జిల్లా ఇన్‌చార్జ్ రమణమూర్తి, పార్థసారథి, రమేష్‌రెడ్డి, పురుషోత్తం, అమర్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలి'


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న రఘువీరారెడ్డి తదితరులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 12 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోను బాగా రాణించాలని కర్ణాటక రాష్ట్రంలోని మైసూరుకు చెందిన విశ్రాంత ఉద్యోగి విక్రాంత్ హట్ పేర్కొన్నారు. నీలకంఠాపురంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురవారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. రఘువీరారెడ్డి పెద్దతండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీరామిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. అనంతరం విక్రాంత్ హట్ క్రీడా జ్యోతిని వెలిగించి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కేటీ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

అగళి, సెప్టెంబరు 12 : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. అగళి ఆదర్శ పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో 30 మంది, బాలకల విభాగం 20 మంది ఎంపికైనట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్, పీడీ నారాయణ స్వామి తెలిపారు. అండర్-14, 17 మండలస్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని తెలిపారు.




ఎంపికైన విద్యార్థులతో పీడీలు

నేటి నుంచి గోరంట్లలో...

గోరంట్ల, సెప్టెంబరు 12: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బాలబాలికల కోసం శుక్రవారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం గోపాల్, పీడీ రామమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు క్రీడాపోటీసలు నిర్వహిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు.